సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



అపరాలకు దక్కని మద్దతు..!

అపరాల (పెసర, మినుము) పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

- 8లో



ప్రాణం మీదికి తెచ్చిన పది రూపాయలు

పెట్రోల్ బంకులో చిరిగిన పది రూపాయల నోటు గొడవ ఓ వ్యక్తి ప్రాణాల మీదికొచ్చింది. వినియోగదారుడు కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు.

- 8లో



దివ్యాంగులకు తప్పిన ఇక్కట్లు

దివ్యాంగులకు రైల్వే పాస్‌లను ఆన్‌లైన్‌లో అందించేందుకు రైల్వేశాఖ వెబ్‌సైట్‌ను ప్రారంభించింది.

- 8లో

న్యూస్‌రీల్

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో వీఆర్వోలు, వీఏఏలతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గృహనిర్మాణాలకు సంబంధించిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరుచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ గీతాంజలి, మండల వ్యవసాయాధికారి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కుంకి ఏనుగుల నివాస స్థలం పరిశీలన



కుంకి ఏనుగుల స్థలాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర అటవీశాఖ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును తరలించడానికి తీసుకురానున్న కుంకి ఏనుగుల నివాసానికి అనరమైన స్థల ఏర్పాట్లను రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట కొండ ప్రాంతంలో కుంకి ఏనుగుల కోసం ఏర్పాటు చేసిన స్థావరాలను ఆమె తనిఖీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో ఏడు ఏనుగుల గుంపు, పాలకొండ నియోజకవర్గంలో నాలుగు ఏనుగుల గుంపు వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గమనించి వాటిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తోందని ఆమె తెలియజేశారు. ఇందులో భాగంగా కుంకి ఏనుగులను తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కొంత మంది అటవీశాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎఫ్ఓ మైడి దివాన్, జిల్లా అటవీశాఖఅధికారి ప్రసూన, ఎఫ్ఆర్ఓ రామం నరేష్, ఎస్ఎఫ్ఓ మనోజ్‌కుమార్, బీట్ ఆఫీసర్ రిషి పాల్గొన్నారు.

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

- వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి



విజయనగరం లీగల్: వచ్చేనెల 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లోని న్యాయమూర్తులతో మంగళవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాజీపడదగిన క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, బ్యాంకు, చెక్కుబౌన్స్, ప్రాంసిరీ నోట్, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎగ్జిక్యూషన్ పిటిషన్, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్, భూములు, కుటుంబ తగాదాలు, వాటర్, మున్సిపాలిటీ, ప్రి లిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, టీవీ రాజేష్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవీ రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విజయనగరం గంటస్తంభం: మహాశివరాత్రి పర్వదినాన వివిధ ఆలయాలు సందర్శించే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుందని ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, విజయనగరం డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో రామతీర్థానికి 45 బస్సులు నడుపుతామన్నారు. శ్రీకాకుళం-2 డిపో నుంచి 10 బస్సులు, పాలకొండ, చీపురుపల్లి, గరివిడి మీదుగా పాలకొండ డిపో నుంచి 20 బస్సులు వేశామన్నారు. ఎస్.కోట డిపో నుంచి పుణ్యగిరికి 35 బస్సులు, ఎస్.కోట నుంచి సన్యాసిపాలెంకు 10 బస్సులు వేసినట్టు పేర్కొన్నారు.

ఆ ముగ్గురి మధ్యే పోటీ!



పాకలపాటి రఘువర్మ

కోరెడ్ల విజయగౌరి

డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు

- కీలక దశకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు
- ఈనెల 25 సాయంత్రం 4 గంటలతో ముగియనున్న ప్రచారం
- ఈనెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక
- మొత్తం ఓటర్లు: 22,493 మంది
- పోలింగ్ కేంద్రాలు: 123

సాక్షి ప్రతినిధి,విజయనగరం:

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు అన్ని ప్రాంతాలను చుట్టుముడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలు సైతం తాము మద్దతిచ్చే అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నాయి. గతం కంటే ఈసారి ఓటర్లు పెరిగారు. పోటీ చేస్తున్నవారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో మొదటి ప్రాధాన్యత ఓటుపైనే అందరూ దృష్టి సారిస్తున్నారు. పోటీ చేసిన వారికి మొత్తం పోలైన ఓట్లలో కనీసం 50 శాతం ఓట్లు రావాలి. లేకుంటే 2వ ప్రాధాన్యత ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మద్దతు ఇవ్వని వారిని కూడా పోటీలో ఉన్నవారు రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఈ సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

● పోటీ వారిమధ్యనే..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం పది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు, ఏపీటీఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మల మధ్యే పోటీ ఎక్కువగా ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. విజయగౌరికి ఉత్తరాంధ్రాలో బలమైన యూటీఎఫ్ సంఘాలు మద్దతు ఇస్తుండగా, రఘువర్మకు టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవులు మద్దతు ప్రకటించారు. పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు బీజేపీ నాయకులు, మాజీ పట్టభద్రుల ఎమ్మెల్సీ పీవీ మాధవ్ మద్దతు ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు వీరి ముగ్గురి మధ్యే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆ ఇద్దరు కూడా...

ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు ముగ్గురు ప్రధాన అభ్యర్థుల మధ్యే సాగుతుందన్న రాజకీయ విశ్లేషకులు చెబుతుండంగా... శ్రీకాకుళం జిల్లాకు చెందిన బహుజన సంఘాలు బలపరుస్తున్న అభ్యర్థి పోతల దుర్గారావు కూడా ప్రచారంలో స్పీడు పెంచారు. ప్రైవేటు పాఠశాలల నుంచి పోటీ చేస్తున్న సుంకర శ్రీనివాసరావు కూడా ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనుండడంతో మొదట ప్రాధాన్యత ఓటు శాతం ప్రధాన అభ్యర్థులకు తగ్గే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ఈ ఇద్దరు కూడా ఈ ఎన్నికల్లో ఎంతో కీలకం కానున్నారు.

● ప్రచారానికి కొద్దిరోజులే సమయం..

గత కొద్ది రోజులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభ్యర్థులు జోరుగా చేపడుతున్నారు. ఈ ప్రచారం ఈ నెల 25న సాయంత్రం 4 గంటలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు వారికి మద్దతు ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాలు కూడా ప్రచారంలో స్పీడు పెంచాయి. పాఠశాలల్లో వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు ఉండడంతో రాజకీయాలు జోరందుకున్నాయి. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి.

● 123 కేంద్రాల్లో పోలింగ్..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్వతీపురం మన్యం, విజయగనరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలో ఉన్న 22,493 మంది ఓటర్ల కోసం 123 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేశారు. ఈ కేంద్రాల్లో 22,493 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళలు 8,985 మంది, పురుషులు 13,508 మంది ఉన్నారు. శ్రీకాకుళం-5,035 మంది, విజయనగరం-5,223, పార్వతీపురం మన్యం-2,333, అల్లూరి సీతారామరాజు-1,488, విశాఖపట్నం -5,529, అనకాపల్లి జిల్లాలో 2,885 మంది ఓటర్లు నమోదై ఉన్నారు.

పోటీ అభ్యర్థులకు మద్దతు ఇలా...

- గతంలో రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసి పీఆర్‌టీయూ తరఫున బరిలో దిగిన డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడుకు ఏపీటీఎఫ్ (1938), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్), ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాల టీచర్ల సంఘం (ఆప్టా), బహుజన ఉపాధ్యాయ సంఘం, ఆర్‌యూపీపీ, ఆదివాసీ ఉపాధ్యాయ, ఎస్టీయూ సంఘాల (ఉత్తరాంధ్ర జిల్లా నాయకులు) మద్దతు ఉంది.
- తొలిసారిగా బరిలో నిలిచిన పీడీఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల విజయగౌరికి యూటీఎఫ్, ఏపీ మోడల్ స్కూల్ పీఎస్, కేజీబీవీ టీచర్లు, తదితర సంఘాలు మద్దతు తెలిపాయి.
- రెండో సారి పోటీలో ఉన్న పాకలపాటి రఘువర్మకు ఏపీటీఎఫ్ (257), ఎస్ఎల్‌టీఏ, ప్రధానోపాధ్యాయుల సంఘం, పీఆర్‌టీయూడీ, ఏపీ ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘాలు అండగా ఉన్నాయి.



అభ్యర్థుల గెలుపునకు ఇంటింటి ప్రచారం

20న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలకొండకు రాక



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 20వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు రానున్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు పాలకొండకు రానున్నారని అందుకు తగిన ఏర్పాట్లు చేశామని వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) మంగళవారం వెల్లడించారు.

20వ తేదీన జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.40 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. అక్కడ 1.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 2 గంటలకు పాలకొండకు చేరుకుంటారు. హెలిపాడ్ నుంచి 2.15 గంటలకు పాలకొండలోని పాలవలస రాజశేఖరం తనయుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నివాసానికి రోడ్డు మార్గంలో చేరుకుంటారు. పాలవలస విక్రాంత్ కుటుంబ సభ్యులను జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించనున్నారు. దాదాపు గంట పాటు అక్కడ ఉండనున్నారు. తదుపరి సాయంత్రం 3.30 గంటలకు పాలకొండ నుంచి తిరిగి బయలుదేరుతారు. 4.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో బెంగళూరు వెళ్లనున్నారు.

పట్టునిలుపుకున్న వైఎస్సార్‌సీపీ



చైర్మన్ ఎన్నికను నిలిపివేసినట్టు ప్రకటిస్తున్న అధికారులు

- కోరంలేక నిలిచిన చైర్మన్ ఎన్నిక
- ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తాం: ఎన్నికల అధికారి
- మంత్రి మకాం వేసినా ఫలితం శూన్యం

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ పట్టు నిలుపుకుంది. నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికలో కూటమి నాయకుల ఎత్తులను చిత్తుచేస్తూ తమ బలం నిరూపించుకుంది. కౌన్సిలర్లంతా ఏకతాటిపై నిలబడి కూటమినాయకుల ప్రలోభాలను తిప్పికొట్టారు. చైర్మన్ పదవిని తమ పార్టీ వారికి కట్టబెట్టేందుకు గత 15 రోజులుగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పలుమార్లు పాలకొండలో మకాం వేసినా ఫలితం లేకపోయింది.

నిలిచిన ఎన్నిక

ఇప్పటికే మూడుసార్లు కోరం లేక నగరపంచాయతీ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం మరో మారు ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొంత మంది కౌన్సిలర్లను వైఎస్సార్‌సీపీ నుంచి తమవైపు తిప్పుకుని చైర్మన్ పదవి దక్కించుకోవాలని కూటమి నాయకులు ప్రయత్నాలు చేశారు. వీటిని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లందరూ ఐక్యతగా తిప్పికొట్టారు. న్యాయబద్ధంగా తమ పార్టీ కౌన్సిలర్‌కే చైర్మన్ పదవి దక్కాలని స్పష్టం చేశారు. పార్టీని వీడి టీడీపీలోచేరి.. స్వతంత్ర అభ్యర్థిగా చైర్మన్ బరిలో దిగిన ఆకుల మల్లేశ్వరికి మద్దతిచ్చేది లేదన్నారు. ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, జేసీ శోభికలు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికకు వైఎస్సార్‌సీపీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు హాజరుకాలేదు. కేవలం కూటమికి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నుంచి కూటమిలో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసి కోరం లేకపోవడంతో ఎన్నికను రద్దుచేస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ముందుకు సాగుతామని స్పష్టంచేశారు.

ఎన్నికల విధుల్లో తప్పిదాలకు తావివ్వొద్దు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో సమర్ధవంతంగా నిర్వహించాలని, తప్పిదాలకు తావివ్వొద్దని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పీఓలు, ఏపీఓలకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్వో, డుమా పీడీలతో కలిసి ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియపై పీఓలు, ఏపీఓలకు మంగళవారం తొలివిడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై పీఓలు, ఏపీఓలకు పూర్తి అవగాహన అవసరమన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పక పాటించాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఆ సమయంలో పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలో ఉన్నవారికి వరుస క్రమంలో టోకెన్ నంబర్లు అందించి ఓటు హక్కును కల్పించాలన్నారు. పోలింగ్ ముందు రోజున ఉదయం 7 గంటలకు పార్వతీపురం కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు పీఓలు తమ బృందంతో చేరుకోవాలన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద సరఫరా చేసే సామగ్రిని పరిశీలించి తీసుకోవాలన్నారు. తరువాత తమ బృందంతో కలిసి యంత్రాంగం సమకూర్చిన వాహనంతో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

చిన్నపాటి తప్పిదాలకు కూడా తావులేకుండా పారదర్శకంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులను నిర్దేశించిన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత పీఓలదేనన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ కె.హేమలత, డుమా పీడీ కె.రామచంద్రరావు, పీఓలు, ఏపీఓలు, ఎన్నికల సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవసేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) ప్రసవ సేవలు అందించాలని, లేదంటే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ జీవనరాణి హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో 10 పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణుల నమోదు, నెలనెలా వైద్యపరీక్షలు తప్పనిసరిగా జరపాలన్నారు. మాతాశిశు మరణాలను నివారించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుస్తుగా ఆస్పత్రుల్లో చేర్పించాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారిక మందులు అందజేయాలన్నారు. సమావేశంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డెమో వి.చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో దాహం కేకలు

- అడుగంటుతున్న జీవగెడ్డలు
- గిరిజనానికి తప్పని అవస్థలు
- సుదూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకుంటున్న గిరిజనులు
- వందకు పైగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి
- శాశ్వత పరిష్కారం నిల్

సీతంపేట:

ఏజెన్సీలో తాగునీటి కష్టాలు ఆరంభమయ్యాయి. కొండ శిఖర గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. బిందెడు నీటికోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి నెలకుంది. ఏప్రిల్, మే నెలల్లో ఎదుర్కోవాల్సిన నీటి ఎద్దడి ఇప్పటి నుంచే ఆరంభం కావడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా నీటిసేకరణలో నిమగ్నమవుతున్నారు.

జేజేఎం పనులు జరిగేదెప్పుడు...

జల్‌జీవన్ మిషన్ పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రూ.10.77 కోట్లతో 505 పనులు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఇవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీంతో ఇంటింటికీ కుళాయి నీరు ఈ వేసవిలో కూడా సరఫరా అయ్యే సూచనలు కనిపించడం లేదు. ఏజెన్సీలో 556 గ్రామాలున్నాయి. సుమారు 700లకు పైగా బోర్లు, 400 వరకు బావులు, మరో 150 సోలార్ రక్షిత పథకాలున్నాయి. వీటిలో సుమారు వందకుపైగా గ్రామాలు ఏటా తీవ్ర నీటిఎద్దడి ఎదుర్కొంటున్నాయి. దోనుబాయి, దారపాడు, పూతికవలస, కడగండి, మండ, నాయుడుగూడ, పెదరామ, దోనుబాయి, కిల్లాడ, పొల్ల, శంభాం, కుశిమి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎక్కువగా నీటి ఎద్దడి ఉంది. వీటికి శాశ్వత పరిష్కారం లభించని పరిస్థితి. నీటి కోసం గెడ్డలపై ఆధారపడుతున్నారు. జీవగెడ్డలు ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలోనే అడుగంటిపోతున్నాయి. ఏం చేయాలో తెలియని స్థితిలో గిరిజనులు ఉన్నారు. కొండశిఖర గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నావారికి అరకొర మంచినీరు లభిస్తోందని గిరిజనులు తెలిపారు. శాశ్వత పరిష్కారం ఎండమావిగా మారిందంటూ వాపోతున్నారు.



చిత్రంలో కనిపిస్తున్న మహిళలు, వృద్ధులు, పిల్లలది సీతంపేట మండలంలోని ఎగువదరబ గ్రామం. స్థానికంగా తాగునీటి సదుపాయం లేదు. గతంలో రసూల్‌పేట నుంచి మోటార్ పెట్టి పైపుల సాయంతో నీరు గ్రామానికి సరఫరా చేసేవారు. ఆ సదుపాయం ఇప్పుడు నిలిచిపోయింది. గ్రామంలో నివసిస్తున్న 37 కుటుంబాల వారు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలోని గొయిది గెడ్డ నుంచి ప్రతిరోజు తాగునీరు తెచ్చుకుంటున్నారు. గెడ్డ నీరు తాగుతుండదంతో జ్వరాల బారిన పడుతున్నామని వాపోయారు.

చిత్రంలో బావి నుంచి నీరు సేకరిస్తున్నది సీతంపేట మండలం రంగంవలస వాసులు. గ్రామానికి 800 మీటర్ల దూరంలో తాగునీటి బావి ఉంది. గతంలో గిరిజనులు సొంత ఖర్చులతో పైప్‌లైన్ వేసి మోటారు ఆధారంగా తాగునీరు సరఫరా చేసుకునేవారు. ఇప్పుడు మోటారు పనిచేయకపోవడంతో బావి వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. రోజులో సగం సమయం నీటిని తెచ్చుకునేందుకే సరిపోతుందని మహిళలు వాపోతున్నారు. బావి నీరు అడుగంటడంతో ఆందోళన చెందుతున్నారు.



కష్టంగా ఉంది



గ్రామానికి దూరంగా రాళ్లదారిలో వెళ్లి ప్రతి రోజూ నీరు తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉంది. ఎన్ని పనులు చేసి ఇంటికి చేరినా నీటి మోత తప్పడం లేదు. గ్రామాల్లో ఉండే దివ్యాంగులకు బిందెడు నీరిచ్చేవారే కరువయ్యారు. అధికారులు స్పందించి గ్రామానికి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. మహిళల నీటి కష్టాలు గుర్తించాలి.

– సవర చంద్రమ్మ, రంగంవలస

తాగునీటికి కటకట



తాగునీటి ఎద్దడి నెలకొంది. పంచాయతీల్లో ఉన్న నిధులు సైతం తాగునీటి సరఫరా పనులకు ఖర్చుచేశాం. వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సమస్యను ఐటీడీఏ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎస్.సిమ్మయ్య, గొయిది, సర్పంచ్

నివేదిక పంపించాం

తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఏఏ గ్రామాల్లో ముందుగా పనులు చేయాలనేది కలెక్టర్‌కు నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటాం.

– సత్యం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

క్లుప్తంగా

సారాతో నలుగురి అరెస్టు



సారాతో పట్టుబడిన నిందితులతో ఎస్సై సీతారాం, సిబ్బంది

మెంటాడ: సారా తరలిస్తుండగా పట్టుబడిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి సారా బాటిల్స్ మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఆండ్ర ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆండ్ర రిజార్వాయర్ వెనుక గల లోతుగెడ్డ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు 20 బ్యాటిల్స్‌లో 40 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకుని వారిని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పెండింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

- ట్రాన్స్‌కో ఎస్‌ఈ చలపతిరావు
- సాక్షి కథనానికి స్పందన



సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండా రైతులను మోసగిస్తోందని మంగళవారం సాక్షిలో ప్రచురితమైన 'ఉచిత విద్యుత్ పథకానికి మంగళం' అనే కథనంపై జిల్లా ట్రాన్స్‌కో ఈఈ చలపతిరావు స్పందించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్ కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏయే మండలాల్లో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈలను ఆదేశించారు.

గూడ్స్ సైడింగ్ ప్రారంభం



కోమటిపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలులోకి బియ్యాన్ని ఎక్కిస్తున్న కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్ వద్ద గందర గోళం మధ్య గూడ్స్‌సైడింగ్ మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. రైల్వే మూడో లైన్ పనులతో పాటు గూడ్స్ సైడింగ్ పనులు అప్పట్లో ప్రారంభమై పూర్తి కావడంతో బొబ్బిలి గూడ్స్‌షెడ్ స్థానంలో కోమటిపల్లి పల్లి వద్ద మంగళవారం ప్రారంభం కావడంతో ఇంతవరకు బొబ్బిలిలో పని చేసిన కార్మికులతో పాటు వి.కృష్ణాపురం, వింధ్యవాసి, వంగర, పెదమానాపురం, పాచలవలస మరడాం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వందల మంది కార్మికులు రావడంతో మధ్యాహ్నం వరకు పనులు ప్రారంభం కాలేదు. రైల్వేస్టేషన్ నుంచి కోమటిపల్లి ఆటోస్టాండ్ వరకు బియ్యం లారీలు ఉండడం గమనించిన పెదమానాపురం ఎస్సై కాంట్రాక్టర్‌తో మాట్లాడగా ఆయన కార్మికులతో తొలి రోజు 50 లారీలలో వచ్చిన బియ్యాన్ని రైలులో వేయించారు.

చెరకు లారీ బోల్తా



బోల్తాపడిన చెరకు లారీ

రాజాం సిటీ: మండల పరిధి రాజయ్యపేట జంక్షన్ వద్ద మంగళవారం చెరుకు లారీ బోల్తా పడింది. పరిమితికి మించి లోడుతో తెర్లాం నుంచి రేగిడి మండలం సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం రద్దీగా ఉన్న జంక్షన్ వద్ద లారీ బోల్తా పడడంతో కొంతసేపు ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికలోడుతో వెళ్తున్న వాహనాలపై పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	200

అపరాలకు దక్కని మద్దతు..!

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- ఎంఎస్‌పీ కంటే తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- తుఫాన్ల కారణంగా వేల హెక్టార్లలో పంటకు నష్టం



గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో మినుము పంట ఎండ బెడుతున్న రైతు

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ వల్ల వరి పంటతో పాటు అపరాల (పెసర, మినుము) పంటలు కూడా దెబ్బతిన్నాయి. రోజుల తరబడి పొలాల్లో నీరు నిల్వ ఉండడంతో పెసర, మినుము పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో ఆ ప్రభావం దిగుబడిపై పడింది. వర్షాలకు పంట దెబ్బతినడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఉన్న పంటకు కూడా ప్రస్తుతం మద్దతు ధర రాని పరిస్థితి. మార్కెట్‌లో రైతులు పండించిన పంటకు మద్దతు ధర రానప్పుడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర కల్పిస్తూ పంటను కొనుగోలు చేయాలి. అధికారంలోకి వస్తే రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని కూటమి ప్రభుత్వం గ్రామ గ్రామాన ఊదరగొట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి సర్కార్ చెప్పింది. కానీ ఇంతవరకు ఇచ్చిన పాపాన పోలేదు. తాజాగా అపరాలు సాగు చేసిన రైతులు మద్దతు ధర లభించక ఇబ్బంది పడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. తాము పండించిన పెసర, మినుము చాలా వరకు పంట తీసి నూర్పులు చేసి పంట వచ్చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, దీంతో పంటను తక్కువ ధరకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

21,931 హెక్టార్లలో అపరాలు సాగు

జిల్లాలో అపరాలు 21 931 హెక్టార్లలో సాగయ్యాయి. ఇందులో పెసర పంట 5,909 హెక్టార్లలోను, మినుము పంట 16,011 హెక్టార్లలో సాగైంది. వీటి ద్వారా పెసర పంట 3,520 మెట్రిక్ టన్నులు, మినుము పంట 10,081 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెసర ఎంఎస్‌పీ రూ.8682

పెసర పంట ఎంఎస్‌పీ క్వింటారూ. 8682, మినుములు ఎంఎస్‌పీ క్వింటాకు రూ.7400 అయితే ప్రభుత్వం అపరాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అపరాలు విక్రయించాల్సిన పరిస్థితి. పెసలు క్వింటాకు రూ.7 వేలు, మినుములు క్వింటాకు రూ.6500 చొప్పున ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారు. దీని వల్ల రైతులు భారీగా నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

జిల్లాలో సాగైన అపరాల్లో తుఫాన్ వల్ల చాలా వరకు పంట దెబ్బతింది. ఎకరాకి 4 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా ఎకరాకి క్వింటా కూడా దిగుబడి రాని పరిస్థితి. ఉన్న పంటను అమ్ముకుందామన్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా వరకు రైతులు పంట తీసేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏకారణం చేతనో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



విజయనగరం మండలం పినవేమలిలో పొలంలో ఉన్న పెసర పంట

కొనుగోలు కేంద్రాలు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేయాలి

అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ డీఎంకు లెటర్ రాశాం. కొనుగోలు కేంద్రాలు మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఎం.డి.కి ప్రతిపాదనలు పంపిస్తాం

జిల్లా వ్యవసాయ అధికారి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాసిన లెటర్ అందింది. జేసీ ద్వారా మార్క్‌ఫెడ్ ఎం.డి.కి అపరాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తాం. అనుమతి రాగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

ఎస్.వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ , జిల్లా మేనేజర్

సంతృప్తి చెందేలా వినతులకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ఆర్థిక పరమైన అంశాలు, కోర్టుల నుంచి నిలిపివేయమని ఆదేశాలు వచ్చిన అంశాలు తప్ప మిగిలిన అన్ని రకాల వినతులకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. వచ్చిన వినతులకు పూర్తిస్థాయిలో కూలంకుషంగా చదివి, పిటిషనర్లతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అర్జీదారుల సంతృప్తే ముఖ్యమని భావించి సరైన సమాధానం ఇవ్వాలని సూచించారు. ఈమేరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, సీఎంఓ, వీఐపీ గ్రీవెన్స్‌సెల్‌లో నాలుగు రకాల వినతులు అందుతున్నాయని చెప్పారు. వాటిపై నిర్వహించిన విశ్లేషణలో సరాసరిగా ఒక్కో కుటుంబం నుంచి రెండు వినతులు వస్తున్నట్లు తేలిందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని, ఏ ఒక్క వినతైనా గడువు దాటితే సంబంధిత అధికారికి చార్జ్ మెమో జారీ చేయనున్నట్లు హెచ్చరించారు. నియోజకవర్గం వారీగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, బుధవారం లోగా నివేదికలు ఇవ్వాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు, ఎన్నికల తర్వాత నిర్వహించాల్సిన ప్రక్రియపై ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలని తహసీల్దార్లకు సూచించారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ, వచ్చిన వినతులకు సరైన పరిష్కారం చూపిస్తే, రీఓపెన్ కేసుల సంఖ్య తగ్గుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 94 శాతం సమస్యల పరిష్కారం జరుగుతోందని, ప్రతిరోజూ సమీక్షించడం వల్ల పెండింగ్ తగ్గిందన్నారు. రీఓపెన్ కేసులపై మండలాల వారీగా సమీక్షించి, కారణాలను తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతిగృహాన్ని సందర్శించిన జిల్లా జడ్జి

విజయనగరం లీగల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మహారాణి పేటలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం గమనించారు ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. అన్ని రూమ్‌లను పరిశీలించి పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు తెలుసుకున్నారు విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని తెలుసుకున్నారు.



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తదితరులు

కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజేష్ కుమార్, కూర్మానంద రావు, తహసీల్దార్ పి.సత్యవతి ఎంఈఓ, జిల్లా బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు, టూ టౌన్ ఎస్సై కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శంబర పాఠశాలను సందర్శించిన 'కేసలి'



పాఠశాల ఆవరణలో పడి ఉన్న మద్యం బాటిల్‌ను పట్టుకుని ప్రశ్నిస్తున్న బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ అప్పారావు

మక్కువ: మండలంలోని శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడుతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల అనధికార వ్యక్తులు చొరబడి మద్యం తాగడం, తాగిన మద్యం బాటిల్స్ పాఠశాల ఆవరణలో వదిలేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పశువులు సంచరించడం వల్ల కూడా విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, పునరావృతం కాకుండా తక్షణమే తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడికి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పాచిపెంట సీడీపీఓ బొత్స అనంతలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, ఉపాధ్యాయ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. అమ్మవారికి ప్రీతికరమైన బూరెలతో నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ .ప్రసాద్ పర్యవేక్షించారు.

వ్యక్తి అరెస్ట్

గజపతినగరం: చిట్‌ఫండ్ కంపెనీలో లోన్ తీసుకుని సకాలంలో చెల్లించని వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం శ్రీరామ్ (ట్రాన్స్‌పోర్ట్)చిట్‌ఫండ్ కంపెనీలో గజపతినగరానికి చెందిన కొల్లా వెంకట సాయిరామ్ గతంలో తమ ఆస్తి పత్రాలను పెట్టి కొంత నగదు వాడుకున్నాడు. ఆ నగదును సకాలంలో చెల్లించక పోవడంతో విజయనగరం సివిల్ కోర్టు అరెస్ట్ వారెంట్ పంపించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సాయిరామ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు.

ప్రాణం మీదికి తెచ్చిన పది రూపాయలు

- పెట్రోల్ బంక్ ఉద్యోగి నిర్వాకం
- వినియోగదారుడికి విరిగిన కాలు

శృంగవరపుకోట: పది రూపాయలు తెచ్చిన తంటా ప్రాణాల మీదికొచ్చింది. చెల్లని పది రూపాయలు ఇచ్చావంటూ పెట్రోల్‌బంక్ ఉద్యోగి చేయి చేసుకోవడంతో వినియోగదారుడు కాలు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటకు చెందిన నౌదాసరి ఈశ్వరరావు మంగళవారం పనినిమిత్తం తన బైక్‌మీద ధర్మవరం వైపు వెళ్తూ మండలంలోని సీతంపేట గ్రామం వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌కు వెళ్లాడు. బంక్‌లో ఆయిల్ వేయించుకున్న ఈశ్వరరావు సొమ్ము చెల్లించాడు. ఈశ్వరరావు ఇచ్చిన నోట్లలో ఒక పదిరూపాయల నోటు చెల్లదని బంక్ ఉద్యోగి వాదనకు దిగాడు. దీంతో స్వల్ప ఘర్షణ జరిగి బంక్ ఉద్యోగి ఈశ్వరరావును నెట్టేయడంతో పక్కనే ఉన్న రెయిలింగ్‌పై పడిపోయాడు. స్థానికులు హుటాహుటిన చేరుకుని ఈశ్వరరావును ఎస్.కోట ఆస్పత్రికి చేర్చారు. ప్రాథమిక వైద్యం చేసిన వైద్యులు నడుము వద్ద ఇబ్బంది ఉందని, తొడఎముక విరిగిందని చెప్పి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుని బంధువులు బంక్ ఉద్యోగికి దేహశుద్ధి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్.కోట ఎస్సై చంద్రశేఖర్ చెప్పారు.



ఈశ్వరరావును విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

విజయనగరం గంటస్తంభం: ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తూ క్యాబినెట్ చేసిన నిర్ణయం వల్ల రాష్ట్రంలో లక్షలాదిమంది అవుట్‌సోర్సింగ్ కార్మికుల పరిస్థితి పెనంలోనుంచి పొయ్యి మీద పడినట్లు అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మంచి ప్రభుత్వం అయితే మొత్తం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. అంతేగానీ మళ్లీ థర్డ్ పార్టీ విధానంలో కార్మికుల్ని బందీలను చేసి వారి శ్రమను కొల్లగొట్టాలని చూస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు అండగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా దుర్మార్గమైన వైఖరి తీసుకుంటోందని, రిటైర్ అయిన వారిని నిర్దాక్షిణ్యంగా ఇంటికి పంపించి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. చివరికి వాటర్ సప్లై, నైట్ శానిటేషన్, స్ట్రీట్‌లైట్, తదితర విభాగాల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా పీఎఫ్ ఈఎస్ఐ కట్టకుండా, నచ్చినట్లు విధుల నుంచి తొలగించి ఇబ్బందులు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అతి కీలకమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధుల కుదింపు, పోలవరం అమరావతి సహా రైల్వే జోన్ తదితర ప్రాధాన్యతా అంశాలకు కేంద్రం నిధులు కేటాయించకపోయినప్పటికీ కూటమి పెద్దలు మౌనంగా ఉండడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సమస్యలపై కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ, నాయకులు పాపారావు, భాస్కరరావు, గురుమూర్తి, రాఘవ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కోట్లాది రూపాయలతో వ్యక్తి పరారీ

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

సీతానగరం: మండలంలోని నిడగల్లుగ్రామానికి చెందిన వ్యక్తి సుమారు రూ 2.5 కోట్లతో నాలుగు రోజుల క్రితం గ్రామం నుంచి పరారైనట్లు సమాచారం. బాధితులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వ్యక్తి మెడికల్ షాపు నిర్వహిస్తూ చుట్టుపక్కల గ్రామాలు పాపమ్మవలస, నీలకంఠాపురం ప్రజలతో నమ్మకంగా ఉండేవాడు, ప్రజల్లో కలిగిన నమ్మకం అనంతరం చీటీలు, వడ్డీవ్యాపారం, ప్రోనోట్లు రాయడం ఆర్థికపరమైన పనులు నిర్వహించాడు. మందుల షాపునకు వచ్చిన వారిలో కొంతమంది చిన్నపాటి లావాదేవీలు నిర్వహించడం వల్ల చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా ప్రోంసరీ నోట్లు రాసి పంపించేవాడు. అలా డబ్బులున్న వ్యక్తులు అతనిపై ఉన్న ఉమ్మకంతో 90 మందికి పైగా వ్యక్తులు రూ.2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఇచ్చినట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఒకవ్యక్తి కుటుంబ అవసరాల నిమిత్తం అప్పు తీర్చాలని కోరాడు. అయితే అడిగిన వెంటనే అప్పు తీర్చక పోవడం వల్ల ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అదే వ్యక్తి గ్రామ పెద్దల ఎదుట పంచాయితీ పెట్టడంతో ఒకటి -ఒకటిగా అప్పులు ఇచ్చిన వారు బయటకు వచ్చి గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలో పాల్గొన్నారు. మెడికల్ షాపు నిర్వాహకుడిని పెద్దలు పిలిచి అప్పుల విషయమై అడగడంతో కొంతఅప్పు తీర్చుతాను. మిగతా మిగిలిన అప్పు స్థిరాస్తులు విక్రయించి అందరికీ న్యాయం చేయాలని చెప్పినట్లు బాధితులు తెలిపారు. అప్పులు ఇచ్చిన వారిలో ఆందోళన మొదలవడంతో నిర్వాహకుడు సడన్‌గా నాలుగు రోజుల క్రితం పరారయ్యాడు. ఈ విషయమై ఎస్సై ఎం.రాజేష్ వద్ద మంగళవారం ప్రస్తావించగా నిడగల్లులో ప్రజలనుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుని వ్యక్తి పరారైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ జరిగింది. కోట వద్ద ఈ ర్యాలీని ఎస్పీ వకుల్ జిందల్ జెండా ఊపి ప్రారంభించారు. కోటవద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ సింహాచలం మేడ, బాలాజీ జంక్షన్, ట్యాంక్ బండ్, హోటల్ మయూర, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది.అనంతరం ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రమాణాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని చెప్పారు. లైసెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. రోటరీ క్లబ్ నిర్వాహకుడు డా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాణాలు కాపాడుకోవాలంటే మనకు మనమే జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ సూరిబాబు, ఎస్సైలు నూకరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు తప్పిన ఇక్కట్లు

- ఇకపై ఆన్‌లైన్‌లో రైల్వేపాస్
- జిల్లాలో 45 వేల మంది అర్హులు
- ఇకపై ఆన్‌లైన్‌లో పాస్ తీసుకోవడానికి రైల్వేశాఖ చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు



రామభద్రపురం: పాస్ తీసుకోవడానికి దివ్యాంగులు పడే కష్టాలకు రైల్వే శాఖ చెక్ పెట్టింది. దివ్యాంగులు ఇక నుంచి రైల్వే పాస్‌లను నేరుగా స్టేషన్‌కు వచ్చే తీసుకునే పనిలేకుండా అన్‌లైన్‌లో అందించేందుకు రైల్వేశాఖ వెబ్‌సైట్ ప్రారంభించింది.అందులోనే ఈ-టికెట్ బుక్ చేసుకునే కొత్త విధానాన్ని ఆ శాఖ అధికారులు తీసుకొచ్చారు.జిల్లా పరిధిలో అర్థోపెడిక్, అంధత్వం, చెవిటి, మూగ, మానసిక వికలాంగత్వం తదితర అంగవైకల్యం కలిగిన అన్ని వయసుల వారు కలిపి మొత్తం 73 వేల మంది వరకు దివ్యాంగులు ఉన్నారు. వారిలో దాదాపు 45 వేల మంది రైల్వేపాస్‌లు పొందేందుకు అర్హులున్నట్లు అధికార సమాచారం. రైల్వే పాస్‌ల కోసం దివ్యాంగులు నానాకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా రైల్వే శాఖ ప్రవేశపెట్టిన అన్‌లైన్ విధానంతో ఆ కష్టాలు తప్పనున్నాయి.

ఆన్‌లైన్‌లో పాస్ జారీ

ఇకపై దివ్యాంగులు సమీప ఇంటర్నెట్ సెంటర్ లేదా తమ ఇంట్లోనే కంప్యూటర్ నుంచి ఆన్‌లైన్లో జి ఇ://ధీజీతి ద్ర ఝఱ్జు ఝజీధీ.జీ ఝధీజ్ఫ్ ఝట్బజీ .జౌరి.జీ ఽ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పాస్‌కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అందులోనే యూనిక్ డిజేబిలిటీ ఐడీ కార్డు(యూడీ ఐడీ)మంజూరు చేస్తారు. నూతన పాస్ కావాల్సిన వారు, పాత పాస్ రెన్యువల్‌కు కూడా ఇందులోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే వెబ్‌సైట్ అమల్లోకి వచ్చింది. దివ్యాంగులు ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో తొలుత తన పేరు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఎంటర్ చేసి తర్వాత వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. ఇలా ఎన్నిసార్లు అయినా లాగిన్ అయి దరఖాస్తును పరిశీలించుకోవచ్చు.

నూతన విధానంతో సులభతరం..

దివ్యాంగులు పాస్‌లు పొందేందుకు రైల్వేశాఖ ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.గతంలో జిల్లా వాసులు సంబంధిత రైల్వేస్టేషన్‌కు ఇతరుల సాయంతో వెళ్లి అక్కడ దరఖాస్తు అందజేసేవారు. రైల్వే అధికారులు జిల్లా నుంచి వచ్చిన మొత్తాన్ని సేకరించి సంబంధిత రైల్వే సబ్‌డివిజన్‌కు పంపేవారు. అక్కడ అధికారుల ఆమోద ముద్ర పడిన తరువాత తిరిగి జిల్లాకు వచ్చేది. ఇదంతా జరగడానికి దాదాపు మూడు నెలల వరకు సమయం పట్టేది. ఈ లోగా పాస్‌ల కోసం దివ్యాంగులు నాలుగుసార్లు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. వారి ఇబ్బందులను గుర్తించి నూతన విధానానికి రైల్వే శాఖ నాంది పలికింది. దివ్యాంగులు తాము ఉండే ప్రాంతం నుంచే నెట్ సెంటర్, ఈ-సేవా కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఆ తరువాత 20 రోజుల్లోపు వారు ఆన్‌లైన్‌లో పాస్ కూడా తీసుకోవచ్చు. సమయంతో పాటు శారీరక, ఆర్థిక ఇబ్బందులు ఉండవు.



కె.కుమార స్వామి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎ.డి, విజయనగరం